క్లుప్తంగా

చిన్నారుల బక్రీద్ సందడి



ముస్లింల వేషధారణల్లో చిన్నారులు

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు పార్వతీనగర్ అన్నూర్ ప్లే–స్కూల్‌లో బుధవారం ముందస్తు బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు ముస్లింల వేషధారణల్లో సందడి చేశారు. ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ తెలియజేసుకున్నారు. కేక్ కట్‌చేసి పిల్లలకు అందజేశారు. అనంతరం వారికి బహుమతుల ప్రదానం చేశారు. స్కూల్ కరస్పాండెంట్ షేక్ ఫరీద్, ప్రిన్సిపాల్ షహరత్ బీబీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగార్థులకు క్విజ్ పోటీ



విజేతలతో క్విజ్ మాస్టర్ సూర్యారావు

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు బుధవారం గ్రంథాలయ సొసైటీ ఆధ్వర్యంలో క్విజ్ పోటీ నిర్వహించారు. 70 మంది ఏడు గ్రూపులుగా పోటీలో పాల్గొన్నారు. సమకాలీన అంశాలు, చరిత్ర, జాతీయ ఉద్యమం, శాస్త్ర సాంకేతిక విజ్ఞానం, ఆర్థిక, రాజనీతి, భూగోళ శాస్త్రాలు మొదలైన విషయాలపై 70 ప్రశ్నలు అడిగారు. లైబ్రరీ సహ కార్యదర్శి డి.వి.సూర్యారావు క్విజ్‌మాస్టర్‌గా వ్యవహరించారు. విజేతలకు పుస్తకాలు బహుమతిగా అందజేశారు.

షిర్డీసాయికి విశేష పూజలు

సీతమ్మధార: గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా బుధవారం నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని షిర్డీసాయిబాబా దేవాలయంలో విశేష పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు రాజా స్వామి ఆధ్వర్యంలో 11 మంది అర్చక బృందం బాబాకు పంచామృతాభిషేకం, పూజలు చేశారు. తులసీదళాలు, గులాబీ, మల్లెపూలు, విరజాజులతో సాయిని అలంకరించారు. ఈ సందర్భంగా రాజా స్వామి మాట్లాడుతూ గురుపౌర్ణమిని పురస్కరించుకుని పది రోజులపాటు సాయినాథుడిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అర్చక బృందం, సిబ్బంది శివకుమార్, వనజాక్షి పాల్గొన్నారు.

అందరి సహకారంతో ప్రేమసమాజం అభివృద్ధి



మాట్లాడుతున్న ప్రేమసమాజం అధ్యక్షుడు బుద్ధ శివాజీ

డాబాగార్డెన్స్: అందరి సహకారంతో ప్రేమ సమాజం అభివృద్ధికి కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు బుద్ధ శివాజీ పేర్కొన్నారు. ప్రేమ సమాజం నూతన కమిటీ బుధవారం ప్రేమసమాజంలో పదవీ బాధ్యతలు స్వీకరించింది. ఈ సందర్భంగా బుద్ధ శివాజీ మాట్లాడుతూ ప్రేమ సమాజం 93వ సంవత్సరంలోకి అడుగు పెడుతోందని, తాను ఉపాధ్యక్షుడిగా సేవలందించానని, ఇప్పుడు ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఆనందంగా ఉందన్నారు. ఇది పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. నూతనంగా ఎన్నికైన వారందరూ ప్రేమ సమాజం అభివృద్ధికి సైనికుల్లా పనిచేయాలని కోరారు. ప్రేమసమాజంలో నిరాశ్రయులు, అనాథలు 300 మంది వరకు ఉన్నారని, కోవిడ్ సమయంలో ఏ ఒక్కరూ చనిపోకుండా చూసుకున్నామని, అది ప్రేమ సమాజం గొప్పతనంగా పేర్కొన్నారు. ఖర్చుకు వెనుకాడకుండా గోశాల నిర్వహణ చేపడుతున్నామన్నారు. నూతన కమిటీలో ఉపాధ్యక్షునిగా మట్టపల్లి హనుమంతరావు, కేశప్రగడ నరసింహామూర్తి, గౌరవ కార్యదర్శిగా కె.హరిమోహనరావు, గౌరవ కోశాధికారిగా ఎంవీవీకే గుప్తా, సంయుక్త కార్యదర్శులుగా వి.మోహన్‌రావు, వి.కె.సురేష్‌కుమార్, ఎస్.గౌరీ ప్రసాదరావు పలువురు సభ్యులచే ప్రముఖ వైద్యుడు విశ్వేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించి, నియామక పత్రాలు అందజేశారు.

'హర్ దిల్ మే వైఎస్సార్' ప్రారంభం



మసీదు వద్ద కరపత్రాన్ని ప్రదర్శిస్తున్న ముస్లిం మైనారిటీ కమిటీ సభ్యులు

మద్రిపాలెం: హర్ దిల్ మే వైఎస్సార్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ముస్లిం మైనారిటీ కమిటీ సభ్యులు బుధవారం 53వ వార్డులోని డాక్టర్ జాకీర్ హుస్సేన్‌నగర్ మస్జిద్–ఈ–అల్ ఖదీర్‌ను సందర్శించారు. కమిటీ సభ్యులైన వైఎస్సార్‌సీపీ జిల్లా మైనారిటీ విభాగం అధ్యక్షుడు కె.వి.బాబా, రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి ఐహెచ్ ఫారుఖీ, మైనారిటీ రీజనల్ కో ఆర్డినేటర్ బర్కత్ అలీ, మైనారిటీ నాయకుడు షేక్ బాబ్జి తదితరులు మసీదుకు సంబంధించి హిమామ్(ముస్లిం మత గురువు) మౌజన్ వేతనాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. మస్జిద్–ఈ–అల్ ఖదీర్ సంఘ సభ్యులు తమ ప్రాంతంలో దీర్ఘకాలికంగా ఉన్న మసీద్ స్థల సమస్య, ముస్లిం బరియల్ గ్రౌండ్ సమస్యను హర్ దిల్ మే వైఎస్సార్ కమిటీ సభ్యులకు వివరించారు. ఆయా సమస్యలను నమోదు చేసుకున్న సభ్యులు వాటిని నేరుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఉపాధి కల్పనకు ఉచిత శిక్షణ

మురళీనగర్: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనలో భాగంగా సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైమ్ అండ్ షిప్‌బిల్డింగ్ (సెమ్స్) లో వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెమ్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ గోపీకృష్ణ శివం ఒక ప్రకటనలో తెలిపారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య పథకంలో భాగంగా 18–26 సంవత్సరాల యువతకు ఉచిత వసతీ సౌకర్యాలతో ఉపాధి శిక్షణ ఇస్తామన్నారు. పదో తరగతి, ఐటీఐలో వెల్డర్, ఫిట్టర్, టర్నర్, సీవోపీఏ, మెషినిస్ట్, మెకానికల్ డిప్లమో, డిగ్రీ ఉత్తీర్ణులైనవాళ్లకి వెల్డింగ్ టెక్నాలజీ, లాజిస్టిక్స్ సెక్టార్‌లోని వేర్‌హౌస్ సూపర్‌వైజర్ కోర్సులు, సీఎన్‌సీ మెషీన్ ఆపరేటర్ కోర్సుల్లో మూడు నెలలపాటు ఉచితంగా భోజన వసతి కల్పిస్తూ శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం ఉపాధి కల్పిస్తామని చెప్పారు. ఆసక్తి గల వారు సింధియా కూడలిలోని సెమ్స్ కార్యాలయానికి నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 77948 40934, 85006 87750 లేదా 0891–2704010 ఫోన్ నంబర్లలో జూలై 5వ తేదీలోగా సంప్రదించాలన్నారు. శిక్షణ తరగతులు జూలై 10 తేదీ నుంచి ప్రారంభమవుతాయని చెప్పారు.

రేపు మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో క్లరికల్, టెక్నికల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 30న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారులు సిహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.శాంతి(టెక్నికల్)తెలిపారు. డబ్ల్యుఎన్‌ఎస్ గ్లోబల్ సర్వీసెస్, ముత్తూట్ ఫైనాన్స్ కార్ప్, హెటిరో డ్రగ్స్, నవత రోడ్డు ట్రాన్స్‌పోర్ట్, సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, డక్కన్ ఫైన్ కెమికల్స్, పేటీఎం, సువర్ణభూమి డెవలపర్స్, అపోలో ఫార్మసీ ప్రైవేట్ లిమిటెడ్ తదితర సంస్థల్లో 375 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. ప్రాసెస్ అసోసియేట్, కాల్ అసిస్టెంట్, ఆపరేటర్, కస్టమర్ ప్రతినిధి, కెమిస్ట్, క్యాషియర్, జూనియర్ క్యాడ్ ఇంజినీర్, వేర్‌హౌస్ అసోసియేట్స్, జీఐఎస్ ఇంజినీర్ క్యాడ్, టెలీకాలింగ్, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, కేర్ టేకర్స్, సెక్యూరిటీ గార్డ్స్, బ్రాంచ్ గోడౌన్ ఇన్‌చార్జి, కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలను భర్తీ చేస్తారు. ఎస్‌ఎస్‌సీ, ఏదైనా డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్, ఐటీఐ, డిప్లమో, బీటెక్, ఎంబీఏలో ఉత్తీర్ణత సాధించి 18–27 ఏళ్ల వయసు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులు. ఆసక్తి గల అభ్యర్థులు https:// www. ncs.gov.in/ లో తమ పేర్లు నమోదు చేసుకోవాలి. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి జరిగే జాబ్‌మేళాకు హాజరు కావాలని వారు కోరారు.

'జగనన్న సురక్ష'తో అర్హులందరికీ లబ్ధి



అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు

సీతంపేట: అర్హులైన చిట్టచివరి లబ్ధిదారు వరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, 44వ వార్డు కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు తెలిపారు. వార్డులోని 243, 244, 245 సచివాలయాల పరిధిలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు బుధవారం ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, సేవలు ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని, ఇంటింటా సర్వే నిర్వహించి ఎవరైనా అర్హులైన లబ్ధిదారులు పథకాలు అందుకోకుండా ఉండిపోయారా అని గుర్తించి వారికి అందేలా చూడాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బాణాల తరుణ్‌కుమార్, శిక్షణ సమన్వయకర్త సందీప్, మాజీ కార్పొరేటర్ బులుసు జగదీష్, గోపి, వెంకట్, హబీబ్, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల పాత్ర కీలకం

- శిక్షణ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: మాతా, శిశు సంరక్షణ చర్యల్లో ఆశా కార్యకర్తల పాత్ర కీలకమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. రేసపువానిపాలెంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఆశా కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాతృ, శిశు మరణాలు సంభవించకుండా మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. ప్రతి ఆశా కార్యకర్త గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలోని గృహాలను సందర్శించి కుటుంబ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. మలేరియా, డెంగ్యూ మొదలగు సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి జాగ్రత్తలు తెలియజేయాలన్నారు. ఈ ఆశా యాప్‌లో గర్భిణులకు అందించే వాటిని తప్పనిసరిగా నమోదు చేయాలని చెప్పారు. అనంతరం ఆశా కార్యకర్తకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రామిరెడ్డి, జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు, అధికారులు మనోరమ, ధర్మేంద్ర, మణికుమారి, స్వర్ణలత, ఎలామా దేవి తదితరులు పాల్గొన్నారు.

పాఠకుడిని కట్టిపడేసేలా కథన శిల్పం



మాట్లాడుతున్న శేఖరమంత్రి ప్రభాకర్

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రిజమ్ కళాశాలలో జరిగిన కథా కచేరి అందరినీ అలరించింది. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ మంచి కథ అంటే కావ్యంలా, పాఠకుడిని మళ్లీ మళ్లీ చదివించేలా ఉండాలన్నారు. పాఠకుడిని కట్టిపడేసేలా కథన శిల్పం ఉండాలని సూచించారు. మానవ స్వభావాన్ని ఆకళింపు చేసుకునేలా కథ ఉండాలని, అప్పుడే దానికి శాశ్వతత్వం లభిస్తుందన్నారు. కె.వి.ఎస్.మూర్తి మాట్లాడుతూ తెలుగు, ఆంగ్ల రచయితలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరించారు. రచయిత డి.వి.సూర్యారావు మాట్లాడుతూ యువ రచయితలకు పరిశీలన, అధ్యయనం అవసరమని, చెప్పవలసిన విషయాన్ని బలంగా , ఆకట్టుకునేలా ఉండాలని సూచించారు. రచయితలు చిన సూర్యనారాయణ, కొత్తూరి రమణ, పువస్తు ఫణిశయన సూరి, హరికుమార్, బి.రాధారాణి, వేదుల కామేశ్వరశర్మ తదితరులు కథలు చదివి వినిపించారు.

గురుపౌర్ణమి వేడుకల కరపత్రిక ఆవిష్కరణ



కరపత్రికను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో బుధవారం గురుపౌర్ణమి వేడుకల కరపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు మాట్లాడుతూ జూలై 3న గురుపౌర్ణమి సందర్భంగా ఉదయం 8 గంటల నుంచి భక్తుల స్వహస్తాలతో బాబాకు క్షీరాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం భారీ అన్నదానం, సాయంత్రం 7 గంటలకు పల్లకీ సేవ, సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు అర్ధ ఏకాహం(భజన) కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో త్రిపురాన రాంబాబు, ఆంజనేయరాజు, శ్రీనివాసరావు, రంగారావు, రమణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సూర్యతేజ

మురళీనగర్: పట్టాభిరెడ్డి తోటలోని వానప్రస్థ వృద్ధాశ్రమంలో ఏజీకేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆశ్రమ వృద్ధులతోపాటు పరిసర ప్రాంతాలకు చెందిన 120 మందికి బీపీ, సుగర్, గుండె వ్యాధులు, కీళ్ల నొప్పులకు సంబంధించిన సమస్యలపై డాక్టర్ సూర్యతేజ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వృద్ధాశ్రమ నిర్వాహకుడు రొబ్బి శ్రీనివాసరావు వైద్య శిబిరం నిర్వహణకు సహకరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- 54వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



శివనగర్‌లో స్థానికులకు సంక్షేమ పథకాల కరపత్రాలు అందిస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ రజని

కంచరపాలెం: ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 54వ వార్డు శివనగర్, మహారాణి వీధి, సాయినగర్, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి నివాసులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి కరపత్రాలు అందజేశారు. వారి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేలా, సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందేలా సీఎం వైఎస్ జగన్ పనిచేస్తున్నారన్నారు. మళ్లీ ఆయననే ముఖ్యమంత్రిగా గెలిపించాలని స్థానిక ప్రజలను కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చల్లా రజని, పార్టీ వార్డు అధ్యక్షుడు కాయిత పైడి రత్నాకర్ యాదవ్, బీసీ జోనల్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, వార్డు నాయకులు ఈశ్వరరావు, చిరంజీవి, రమణమ్మ, రత్నాకర్, శ్రీను, సోమేష్, రాంబాబు, నమ్మి శంకర్, ప్రసాద్, నాగరాజు, దిలీప్, రాధాకృష్ణ, దివాకర్, అశోక్, కృష్ణ, రాము, సంతోష్, జ్ఞానేశ్వరరావు, వెంకటేష్, సంతోష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

శిశుగృహ, ఐసీడీఎస్ కార్యాలయాల సందర్శన

మద్రిపాలెం: ఆర్ అండ్ బీ జంక్షన్ వద్ద ఉన్న శిశుగృహ, ఐసీడీఎస్ కార్యాలయాన్ని బుధవారం ఆర్‌జేడీ చిన్మయిదేవి, పీడీ వెంకటేశ్వరి సందర్శించారు. శిశుగృహలో పలు దస్త్రాలను పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. ఐసీడీఎస్ కార్యాలయంలో ఇటీవలే నూతనంగా ఏర్పడిన సెక్టార్ విధివిధానాలను వారు అడిగి తెలుసుకున్నారు. అక్కడ నిర్వహించిన ప్రాజెక్ట్ సమావేశంలో అంగన్‌వాడీ సిబ్బంది పలు సూచనలిచ్చారు పర్యటనలో అడిషనల్ సీడీపీవో శ్రీలత, సూపర్‌వైజర్లు కుమారి, వెనిష తదితరులు పాల్గొన్నారు.

సంపత్ వినాయకుని హుండీల ఆదాయం లెక్కింపు

సీతమ్మధార: ఆశీలమెట్టలో కొలువైన సంపత్ వినాయగర్ ఆలయం హుండీలను బుధవారం దేవదాయ శాఖ తనిఖీదారుడు బి.వసంత కుమార్ పర్యవేక్షణలో లెక్కించారు. 25 రోజులకు గానూ రూ.17,03,494, 11 గ్రాముల బంగారం, 122 గ్రాముల వెండి, 61 యూఎస్‌ఏ డాలర్లు, 10 కెనడియన్ డాలర్లు, 1002 ఖతార్ రియాల్, 20 మలేషియా రింగిట్, 30 యెన్‌లు వచ్చినట్లు ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్.చోళన్ తెలిపారు. శివజ్యోతి, శ్రీ వేంకటేశ్వర సేవా సంఘం సభ్యులు హుండీల లెక్కింపు చేపట్టారు. ఆలయ సిబ్బంది జి.గోవింద్‌రెడ్డి, బి.జి.ఎస్ ప్రసాద్, ఈ.అప్పలరాజు, బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారు.

కనుల పండువగా శోభాయాత్ర



యాత్రలో పాల్గొన్న భక్తులు

బీచ్ రోడ్డు: ఉత్కల్ సమాజ్ ఆధ్వర్యంలో బుధవారం జగన్నాథుడి బహుదా శోభాయాత్ర కనుల పండువగా సాగింది. లాసన్స్ బే కాలనీలో ప్రారంభమైన యాత్ర వుడా పార్కు, చినవాల్తేరు, ఏయూ గేటు, సిరిపురం మీదుగా దసపల్లాహిల్స్‌లోని జగన్నాథ స్వామి ఆలయానికి చేరుకుంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగారు. ఉత్కల్ సమాజ్ అధ్యక్షుడు నాయక్ మాట్లాడుతూ 9 రోజుల పాటు ప్రత్యేక పూజలు అందుకున్న జగన్నాథుడు, బలభద్రుడు, దేవి సుభద్రలు తిరిగి తమ ఇంటికి చేరుకున్నారన్నారు.

2న గిరిప్రదక్షిణ భక్తులకు అల్పాహారం పంపిణీ

మహారాణిపేట: సింహాచలం శ్రీవరాహ లక్ష్మీనరసింహ స్వామి గిరిప్రదక్షిణను పురస్కరించుకొని జూలై 2న డాక్టర్ వి.ఎస్.కృష్ణ కాలేజీ ఓల్డ్ స్టూడెంట్ ఫోరం ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం పంపిణీ చేయనున్నారు. ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి మురళీనగర్ అయ్యప్పనగర్ రోడ్డులో(వైభవ వెంకటేశ్వర స్వామి దేవాలయం దగ్గర) గిరిప్రదక్షిణ చేసే భక్తజనానికి ఇడ్లీ, టమటాబాత్, మిరియాల పాలు అందజేస్తామని ఫోరం ప్రతినిధులు పట్నాల నాగరామ మోహనరెడ్డి, గుండు వెంకటేష్, భూపతి సత్యనారాయణ, సింగూరు నరసింగరావు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలిలా.. బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లోని ఒక ఇంట్లో పేకాటాడుతున్నట్లు సమాచారంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథ్ ఆధ్వర్యంలో సిబ్బంది 8 మందిని అదుపులోకి తీసుకొని ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. వారి వద్ద నుంచి రూ.1.12 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.

వార్డుల వారీగా వసతుల కల్పన



53వ వార్డులో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కె.కె.రాజు, బర్కత్ అలీ

మద్రిపాలెం: నియోజకవర్గంలో వార్డుల వారీగా మౌలిక వసతులకు సంబంధించి అభివృద్ధి పనులు పూర్తి చేస్తున్నామని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు తెలిపారు. 53వ వార్డు శ్రీహర్షనగర్‌లో రూ.14 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం కార్పొరేటర్ బర్కత్ అలీతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సుకు నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యం, ఉపాధి రంగాలకు పెద్దపీట వేస్తున్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఇప్పటికే అనేక సమస్యలు గుర్తించామని, రోజుల వ్యవధిలో వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. వార్డు పరిధిలో గుర్తించలేని అభివృద్ధి పనులు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కె.కె.రాజు కోరారు. కార్యక్రమంలో ఈఈ శ్రీనివాస్, డీఈ భరణి, ఏఈ ఉషా, పార్టీ నాయకులు తుళ్లి చంద్రశేఖర్ యాదవ్, షేక్ బాబ్జి, సదరం జ్ఞానేష్, హనుమంతు, వైజి, అలీ, అనిల్, భాను, జయ, సంపత్ ధామస్, కాజా, జాబర్, దీపు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



అంబేడ్కర్ కాలనీలో కల్వర్టు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను బుధవారం కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పరిశీలించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన రూ.20 లక్షల నిధులతో అంబేడ్కర్ కాలనీ 287 సచివాలయం పరిధిలో రోడ్లు, సీసీ డ్రైన్లు, రూ.4.5 లక్షలతో సిల్ట్ వర్కులు, రూ.12 లక్షలతో కల్వర్టు రిటైనింగ్ వాల్‌కు సంబంధించి పనులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పనుల్లో నాణ్యతా లోపం లేకుండా చూడాలని సిబ్బందికి తగు సూచనలిచ్చారు. కార్యక్రమంలో కరిమిరెడ్డి శ్యామ్, గణేష్, శంకర్‌రావు, బుల్లిబాబు, వినోద్, కాంట్రాక్టర్ సునీల్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.